మేకలమండి..అమ్మకాల గండి!

- జియాగూడలో తగ్గిన మేకలు, గొర్రెల విక్రయాలు
- అధిక ధరలు, నగర పరిసరాల్లోనూ అమ్ముతున్న వైనం
- మండి సమస్యలూ కారణంగా చెబుతున్న పలువురు వ్యాపారులు





జియాగూడ: జియాగూడ మేకల మండి గ్రేటర్‌లోనే మాంసం విక్రయాలకు ప్రసిద్ధి. అలాంటి చరిత్ర గల మండిలో విక్రయాలు అమాంతం పడిపోయాయి. జనావాసాల మధ్య ఉండడం, తరచూ రద్దీ, ఎక్కడ పడితే అక్కడ భారీ వాహనాలు నిలిచిపోవడం, మండికి వచ్చే వారికి సమస్యలు, ఇబ్బందులు ఎదురవ్వడం ఓ కారణంగా పేర్కొంటున్నారు. ఏటా బక్రీద్ పండుగకు 15 రోజుల ముందుగానే గొర్రె మేకల విక్రయాలతో రద్దీగా ఉండే మండిలో విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. ఎలాంటి మోసాలు జరగని మండిగా పేరుగాంచిన జియాగూడ మేకల మండి ప్రస్తుతం వ్యాపారాలు లేక వెలవెలబోతోంది.

నగర ప్రధాన చౌరస్తాల్లోనూ విక్రయాలు

గతంలో కేవలం మేకల మండి పరిసరాల్లో మాత్రమే విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ విక్రయాల కారణంగా జియాగూడ మేకల మండికి ట్రాఫిక్‌లో వెళ్లే బదులు పరిసరాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. మండిలో గొర్రెలు, మేకల ధరలు తక్కువగా ఉన్నప్పటికీ మండికి వచ్చి కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. వాహనాల పార్కింగ్ సమస్య, గంటల తరబడి ట్రాఫిక్ జాంలతో కూడా విక్రయాలు తగ్గాయి. ప్రస్తుతం 10 కేజీల గొర్రె, మేక రూ.10 వేల ధరలతో అందుబాటులో ఉన్నాయి.

నగర పరిసరాల్లో పెరిగిన ఫారం హౌస్‌లు..

జియాగూడ మేకల మండికి ఇండియాలోని పలు రాష్ట్రాల నుంచి లారీల్లో వచ్చేవి. దీనివల్ల గొర్రె, మేకల ధరలు ఖర్చులు పోను లెక్క ప్రకారం ధరలు పెరుగుతాయి. దీంతో కొందరు వ్యాపారులు నగర పరిసరాల్లోనే ఫారం హౌస్‌లు కొని దొడ్డిలు ఏర్పాటు చేసి గొర్రె, మేకలు పెంచుతున్నారు. కొనుగోలుదారులు సైతం వాటిలో పెరుగుతున్న వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యత, తక్కువ ధరల్లో లభిస్తుండడంతో మండి విక్రయాలు తగ్గుతున్నాయని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. బక్రీద్ పండుగ శనివారం కావడంతో విక్రయాలు పెరుగుతాయని వ్యాపారులు ఎదురుచూస్తున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు

గోల్కొండ: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. తపాచబుత్రలోని ఎంకే ఫంక్షన్ హాల్‌లో సెంటర్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ నగరం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదని ఈసారి కూడా గతంలో కంటే ఘనంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి బోనాల జాతర ఉత్సవాల కమిటీ చైర్మన్ కె.చంటిబాబు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు కోట బోనాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బోనాల నిర్వహణకు బల్దియా, పోలీసు అధికారుల సహాయ సహకారాలు అవసరమన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్దిఖీ, ఏసీపీలు మహ్మద్ మునార్, విజయ్ శ్రీనివాస్, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మోజం ఖాన్, కార్యదర్శి కౌసరుద్దీన్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు మైత్రి కమిటీ సభ్యుల సహకారం


టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ ఆలీఖాన్, ఎన్.శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

గోల్కొండ: పండుగలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు ఎంతగానో సహకరిస్తున్నారని సౌత్ వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్దిఖీ అన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు, కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు ఇమ్రాన్ ఆలీఖాన్ బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ కోట బోనాలు తెలంగాణలో మొదటిసారిగా ప్రారంభమవుతాయని కోటలోనే తొమ్మిది పూజల తర్వాత ముగుస్తాయన్నారు. బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నామని కె.చంటిబాబు తెలిపారు. కార్యక్రమంలో

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాయుడు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, పెయింటర్, వెల్డర్, ఆర్.అండ్.ఏసీ, మోటర్ మెకానిక్, కోపా, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ తదితర ట్రేడ్‌ల్లో శిక్షణ పొందేందుకు పదో తరగతి, ఎనిమిదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈనెల 21 లోగా తమ బయోడేటాను వెబ్‌సైట్ iti.teanfana.gov.in లో అప్‌లోడ్ చేయాలని మరిన్ని వివరాలకు 7093619675 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం



అబిడ్స్: టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డిని రాష్ట్ర మేరు యువజన సంఘం నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నేతలు వెన్ను నవీన్‌కుమార్, పోల్కం వినయ్‌రాజ్ ఉన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



లంగర్‌హౌస్: కట్ట మైసమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్‌తో పాటు ఆయన సోదరులు కలిసి బుజిలీ మహంకాళి చైర్మన్ బోగి పరమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేసి అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


నృత్యం చేస్తున్న చిన్నారులు

నాంపల్లి: జవహర్ బాలభవన్‌లో నెల రోజులుగా కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులు నేర్చుకున్న కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలతో అలరించారు. సైన్స్, డ్రాయింగ్ విభాగాల్లోనూ ప్రతిభ చాటారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఎ.భీంరెడ్డి, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వరకృష్ణ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. బాలభవన్ డైరెక్టర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్‌ల అందజేత

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వారికి మెరుగైన విద్యాబోధన లభిస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని 46 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10,035 స్కూల్ యూనిఫామ్‌లను రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ యూసీడీ పీవో ఎ.స్వాతి, సీవోల ఆధ్వర్యంలో పాఠశాలలకు అందించారు.

మృతుడి కుటుంబానికి చేయూత

రాజేంద్రనగర్: గత సంవత్సరం విద్యుదాఘాతంతో రాజేంద్రనగర్ సబ్ డివిజన్ పరిధిలోని మాలే తిమ్మారెడ్డి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా అన్వాడ మండలం మునిమోడం గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి బతుకు తెరువు కోసం నగరంలోని గండిపేట్ మండలం గంధంగూడ వెంకటేశ్వరనగర్‌కు వలస వచ్చాడు. గత సంవత్సరం జూన్ 7వ తేదీన కూలీ పనికి వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య మాలే సుశీల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 4.50 లక్షలను బాండ్ల రూపంలో రాజేంద్రనగర్ సబ్ డివిజన్ ఏడీఈ సత్యనారాయణతో కలిసి వనంపల్లి జైపాల్ రెడ్డి ఇప్పించారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి తదితరులు

సుల్తాన్‌బజార్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి పేర్కొన్నారు. ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ మైక్రో ల్యాబ్స్‌తో కలిసి ఐఎంఏ కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలోకి చేరుతున్నాయి. మైక్రోప్లాస్టిక్స్ నీటి శుద్ధి కేంద్రాలు, డంపింగ్ యార్డుల ద్వారా భూమిలోకి చేరుతున్నాయన్నారు. దీనివల్ల సంవత్సరానికి 300 బిలియన్ నుంచి 600 బిలియన్ వరకు నష్టాలు జరుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించడంలో భాగస్వామ్యం కావాలంటే ప్రపంచ పర్యావరణం దినోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎంఏ సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీ రంగ్ అబ్కారి, డాక్టర్ పల్లం ప్రవీణ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ పుత్లీబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఈనెల 5న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, అఫ్జల్‌గంజ్ బస్టాండ్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే ఫైర్‌స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గురుద్వారా లేన్, అమృత్‌బార్ లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ అరుంధతికాలనీ బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, మహంకాళి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు భారత్ గౌడ్, నిరంజన్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బంగారు శృతి, సీనియర్ నాయకులు చీకోటి ప్రవీణ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ మహేశ్, కొడి మహేందర్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు


సభ్యత్వ బుక్‌లెట్లు అందిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. కూకట్‌పల్లి, ఫిలింనగర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు యువకులు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీవో చేపడుతున్న కార్యక్రమాలకు తాము ప్రభావితమై సభ్యత్వం తీసుకుంటామని మహ్మద్ నజీబ్‌కు తెలిపారు. దీంతో వారిని సభ్యులుగా చేర్చుకోవడంతో పాటు సభ్యత్వ నమోదు కోసం బుక్‌లెట్‌లు అందించారు. కార్యక్రమంలో సయ్యద్ సల్మాన్, టి.శంకర్, రవి, అబ్దుల్ రహమాన్, షానవాజ్, మహ్మద్ ఫహాద్, మహ్మద్ గౌస్ తదితరులు ఉన్నారు.

డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన


బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి జలమండలి డీజీఎం, అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించి యథేచ్ఛగా రాకపోకలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 294 వద్ద గతంలో వాహనాల రాకపోకల కోసం డివైడర్‌ను తొలగించారు. వివిధ కారణాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సంవత్సరం క్రితం డివైడర్లను ఏర్పాటు చేసి రాకపోకలను మూసివేశారు. గత మూడు, నాలుగు రోజులుగా ఈ డివైడర్‌ను కొందరు తొలగించి రాకపోకలను నిర్వహిస్తున్నారు. దీంతో తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. కొద్ది దూరం వెళ్లి అనంతరం యూ టర్న్ తీసుకునే బదులు ద్విచక్ర వాహనదారులు షార్ట్ కట్‌గా ఇక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ రోడ్డుపై బారులు తీరుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అత్తాపూర్: విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను అందజేస్తారని పీఆర్టీయూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్‌సాగర్ తెలిపారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో రూ. 52 వేల ఖర్చు చేసినట్లు శ్రీనివాస్‌సాగర్ తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చేరుతూ వస్తున్నారని అలాంటి విద్యార్థులకు బోధనాంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు పాఠాలను చెబుతున్నట్లు ఆయన వివరించారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు, స్థానికులు సహకరించిన పాఠశాలలను అభివృద్ధిలోకి వస్తాయని తెలిపారు.

శానిటేషన్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


దేవరకొండ బస్తీలో శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బంజారాహిల్స్: మూడు రోజుల పాటు జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిలో పాల్గొనే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లో ప్రారంభమైంది. శానిటేషన్ డ్రైవ్‌ను కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీవాసులకు ప్రత్యేక కార్యక్రమాన్ని వినియోగించుకొని పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించుకోవాలని సూచించారు. నివాసిత ప్రాంతాల్లో ఎక్కడైనా చెత్త పేరుకుపోయి ఉంటే జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చి చెత్తను శుభ్రం చేయించుకోవాలని సూచించారు. డీఎంసీ సమ్మయ్య, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'నేటి మాట' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత పి.లక్ష్మారెడ్డి రచించిన నేటి మాట పుస్తకావిష్కరణ సభను బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రైతుల గురించి రచయిత రచించిన తీరు ఎంతో బావుందన్నారు. ఊహా శక్తి ప్రకటననే కవిత్వమని, కవికి ప్రతిభా వ్యూహ ఉత్పత్తి అభ్యాసం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకుడు సీహెచ్ రమణకుమార్, తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్, సాహితీవేత్త హైమావతి భీమన్న, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు రామారావు సూర్యప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

మానసిక రోగులకు ఉస్మానియాలో చికిత్స


రోగిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, ఆర్ఎంఓ డాక్టర్ రఫీ

అఫ్జల్‌గంజ్: ఎర్రగడ్డలోని మానసిక రోగుల ఆసుపత్రిలో కలుషిత ఆహారం తినడంతో పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, ఫిజిషియన్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో ఫిజిషియన్, ఎండో క్రైనాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్యులను సమన్వయం చేసుకుంటూ చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ తెలిపారు. మానసిక వైద్యశాలకు చెందిన సైకియాట్రిక్ వైద్యుల సూచనలు, సలహాలు తీసుకుంటూ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రోగుల పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

బక్రీద్ సందడి షురూ

- పాతబస్తీలో మొదలైన సందడి
- పోలీసుల బందోబస్తు
- కొనసాగుతున్న తనిఖీలు


కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్ పరిధిలోవాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


సెవన్‌టూంబ్స్ వద్ద అమ్మకానికి గొర్రెలు

చార్మినార్: పాతబస్తీలో బక్రీద్ సందడి మొదలైంది. నగర పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో సున్నిత, కీలకమైన బస్తీల రోడ్లలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో ఎస్ఐలతో పాటు సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాల రవాణా జరగకుండా తనిఖీలు చేయడమే కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు త్యాగానికి మరో పేరుగా నిర్వహించుకునే బక్రీద్ పండుగ కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలను పాతబస్తీలోని ప్రధాన కూడళ్లకు తీసుకురాగా ముస్లింలు కొనుగోలు చేస్తున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్..

ముస్లింలకు ప్రధానంగా ఏడాదిలో రంజాన్, బక్రీద్ పండుగలు మాత్రమే. అల్లాహ్‌పై భక్తికి రంజాన్ ప్రతిరూపమైతే..త్యాగానికి ప్రతిరూపం బక్రీద్. అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని నాటి ప్రవక్త ఇబ్రహీం (అ), ఇస్మాయిల్ (అ)ల త్యాగనిరతిని బక్రీద్ పండుగ గుర్తు చేస్తుంది. బక్రీద్‌ను 'ఈద్-ఉల్-అజ్‌హా' అని కూడా అంటారు.

మూడు భాగాలుగా ఖుర్బానీ మాంసం..

ఖుర్బానీ ఇచ్చే వారికి ముఖ్యంగా వడ్డీతో కూడిన అప్పు ఇవ్వరాదు..తీసుకోరాదు. చిన్నజీవాలను వ్యక్తిగతంగా, పెద్ద జీవాలను ఏడుగురు భాగస్వాములై ఉండాలి. అల్లాహ్ పేర బలిచ్చిన ఈ జంతువుల మాంసాన్ని మూడు సమాన భాగాలను చేయాలి. దీంట్లో ఒక భాగం ఖుర్బానీ ఇస్తున్న వారు తీసుకుని రెండో భాగాన్ని తమ బంధువులకు, మూడో భాగాన్ని పేద ముస్లింలకు పంచాలి. బలిచ్చే జంతువుల శరీర భాగాల్లో ఎలాంటి లోపం ఉండరాదు.

సీపీ సూచనలు, సలహాలు

బక్రీద్ ఏర్పాట్లపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఇప్పటికే సాలార్‌జంగ్ మ్యూజియంతో పాటు సీసీసీలో సమావేశాలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో పాటు ఖురేషీలు, గోరక్షా ప్రతినిధులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జంతు కళేబరాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది సూచనల మేరకు వ్యవహరించాలని సూచించారు. పశు వైద్యుల నిబంధనల మేరకు జంతువులను తరలించాలని..అక్రమ రవాణా చేయవద్దని కోరారు.

గోల్కొండలో..

గోల్కొండ: రేతిబౌలి రోడ్డు, గుడిమల్కాపూర్, కార్వాన్, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో గొర్రెల అమ్మకాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. గొర్రెల బరువును బట్టి రూ. 10 నుంచి రూ. 25 వేల వరకు అమ్ముతున్నారు.

గడ్డికి సైతం గిరాకీ..

భారీ సంఖ్యలో వస్తున్న గొర్రెల కోసం వాటికి కావాల్సిన మేత సైతం మార్కెట్‌లో వ్యాపారులు అమ్మకానికి పెట్టారు. పచ్చగడ్డితో పాటు కుట్టిని సైతం సంచుల్లో పెట్టి అమ్ముతున్నారు. పచ్చగడ్డి కట్ట సైజును బట్టి రూ.50–200 వరకు అమ్ముతున్నారు. ఎండుగడ్డి పొట్టు సైతం సంచుల్లో పెట్టి విక్రయిస్తున్నారు.

కత్తులు పదును పెట్టే వారికి ..

రేతిబౌలి చౌరస్తా, టోలిచౌకీ చౌరస్తా, షేక్‌పేట్ రోడ్డు గోల్కొండ తదితర ప్రాంతాల్లో కత్తులు పదును పెట్టే వారికి కూడా గిరాకీ ఏర్పడింది. కత్తి సైజును బట్టి వారు ఒక్కో కత్తిని పదును పెట్టేందుక రూ.30–150 వరకు చార్జీ చేస్తున్నారు. మాంసాన్ని ముక్కలు చేసేందుకు వాడే చెక్కపీటలు సైతం బాగా అమ్ముడవుతున్నాయి.